క్లుప్తంగా

గని మేనేజర్‌కు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా నుంచి కార్పొరేట్‌కు బదిలీపై వెళ్తున్న పీవీకే–5 ఇంక్‌లైన్ మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌ను మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ... గనిలోని పలు సమస్యల పరిష్కారంలో గని కేజీకి జనరేటర్ ఏర్పాటులో, గనిలో మ్యాన్ రైడింగ్ ఏర్పాటుకు శక్తికి మించి కృషి చేశారని, గనిలో పెరిగిన గైర్హాజరు శాతాన్ని పెంచటంలో కార్మిక కుటుంబాలతో కౌన్సెలింగ్ నిర్వహించి హాజరుశాతం పెంపుకు కృషి చేశారన్నారు.

డిపెండెంట్ ఉద్యోగాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాలని టీఈఈ యూనియన్ (1104) రాష్ట్ర అధ్యక్షుడు వేమునూరి వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధీర్ అన్నారు. మంగళవారం హైదారాబాద్ విద్యుత్ సౌధ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మాట్లాడుతూ... బీటెక్, డిప్లొమా అర్హత ఉన్న అభ్యర్థులకు సబ్ ఇంజనీర్ పోస్ట్, డిగ్రీ ఉన్న వారికి మాత్రమే జూనియర్ అసిస్టెంట్ పోస్ట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ సెక్రటరీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'గూడెం'లో వైద్యుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తగూడెంరూరల్: బెంగాల్‌లో మహిళా వైద్యురాలు మమితను అత్యాచారం చేసి చంపినందుకు నిరసనగా కొత్తగూడెం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కొత్తగూడెం పట్టణంలోని వైద్యులు మంగళవారం రాత్రి కొత్తగూడెం పట్టణంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ బాబూరావు, అరకల భాస్కర్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రాజశేఖర్, నాగరాజు, నరేందర్‌రావు, కనుకరాజు మెడికో విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంఆర్‌సీ, సీఆర్‌సీ, యూఆర్ఎస్, కేజీబీవీ ఉద్యోగ, సిబ్బంది డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో విధులు నిర్వహించి మృతి చెందిన వారికి మంగళవారం పాతకొత్తగూడెం ఆనందఖని పాఠశాలలో నివాళులర్పించారు. మాట్లాడుతూ... భద్రత లేని ఉద్యోగాలలో ఇంకెంత కాలం విధులు నిర్వహించాలని, కనీసం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉద్యోగులకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ప్రకటించాలన్నారు. ఉద్యోగులందరికీ రక్షణ లేదని, ప్రభుత్వాలు మారినా ఉద్యోగుల బతుకులు మారడం లేదన్నారు. ఈ ప్రభుత్వమైన ఉద్యోగుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

పీహెచ్‌సీ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఏజెన్సీ గ్రామాలలో విష జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి జ్వరాలు ప్రబలుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆరోపిస్తూ పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం కొమరారం పీహెచ్‌సీ వద్ద ధర్నా చేశారు. ఆస్పత్రి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. పీహెచ్‌సీలలో వైద్యులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ఖాళీలను భర్తీ చేయాలని, జ్వరాలకు అవసరమైన మందులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కేవలం ఇద్దరు వైద్యులతో 3వేల మంది ప్రజలకు ఎలా వైద్యసేవలు అందిస్తారని ప్రశ్నించారు.

జ్వరాలతో వణుకుతున్న పల్లెలు

రోగులతో ప్రభుత్వాస్పత్రి కిటకిట



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వరబాధితులు

జూలూరుపాడు: మండలంలోని పల్లెలు జ్వరాలతో వణికిపోతున్నాయి. జ్వరం, కీళ్ల, ఒంటి నొప్పులు, జలుబు, దగ్గులతో ప్రజలు విలవిలలాడుతున్నారు. బాధితులు స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వస్తుండటంతో కిటకిటలాడుతోంది. నెల రోజులుగా విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు విజృంభిన్నాయి. ప్రభుత్వాస్పత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. సరిపడా బెడ్లు అందుబాటులో లేకపోవడం, కూర్చోవడానికి కుర్చీలు సైతం లేకపోవడం, మినరల్ వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో తాగడానికి నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది కొరత ఏర్పడటంతో సరైన వైద్యసేవలు అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. నలుగురు వైద్యులు ఉండాల్సి ఉండగా ఇద్దరు డిప్యూటేషన్‌పై డీఎంహెచ్ఓ ఆఫీస్‌లో పని చేస్తుండగా ఇద్దరు మాత్రమే వైద్యసేవలు అందిస్తున్నారు. ఇటు ఆస్పత్రిలో, అటు గ్రామాల్లో జ్వరాలు వ్యాప్తి పెరగడంతో వైద్యశిబిరాలు నిర్వహించాల్సి వస్తుండటంతో ఇబ్బందికరంగా మారింది. పీహెచ్‌సీలోని ల్యాబ్ టెక్నీషియన్ బదిలీ కావడంతో ఆ స్థానంలో మరొకరిని నియమించారు. సీబీపీ మిషన్ చెడిపోవడంతో ప్లేట్‌లెట్స్ గుర్తించే అవకాశం లేకపోవడంతో మూడు వారాలుగా వైద్యులకు ఇబ్బందిగా ఉంది. జ్వరపీడితులు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి టెస్టులు చేయించుకుంటున్నారు. ఇన్వర్టర్ బ్యాటరీలు కాలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆస్పత్రిలోని ఫ్యాన్లు తిరగక, లైట్లు వెలగక రోగులు, వైద్యులు, వైద్యసిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలో నైట్ వాచ్‌మెన్లు లేకపోవడంతో రాత్రివేళలో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులకు రక్షణ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డాక్టర్లు రాసిన మందులు ఆస్పత్రిలో లేకపోవడంతో ఒకటి, రెండు మందు బిళ్లలు ఇస్తున్నారని రోగులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారుల స్పందించి ఆస్పత్రిలో వసతులు కల్పించడంతోపాటు, మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యసేవలు అందిస్తున్నాం



ప్రతీరోజు 150 – 200 పైగా ఓపీ ఉంటోంది. సీజనల్ వ్యాధుల సమయం కావడంతో పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. ఆస్పత్రికి వచ్చిన వారందరికీ వైద్యసేవలు అందించి పంపిస్తున్నాం. కలెక్టర్, డీఎంహెచ్ఓ ఆదేశాల మేరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు, ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. అదేవిధంగా హాస్టల్, ఆశ్రమ పాఠశాల, కేజీబీవీల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీ, జూలూరుపాడు

రుణమాఫీకి షరతులు పెట్టొద్దు



మాట్లాడుతున్న రమేష్

జూలూరుపాడు: షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు లేక మాన్యువల్ పహణీపై రుణాలు తీసుకున్నారని, వీరందరికీ రుణమాఫీ కాలేదన్నారు. ఆగస్టు 15 నాటికి రైతులందరికీ రుణమాఫీ చేస్తామని సీఎం చెప్పారని, 50 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. రైతు భరోసా జూన్‌లో వేయాల్సి ఉన్నప్పటికీ ఆగస్టు వచ్చినా వేయలేదని, రైతు కూలీలకు రూ.12,000, కౌలు రైతులకు రూ.15.000 అమలు ఊసేలేదని విమర్శించారు. జూలూరుపాడు మండలానికి సీతారామ నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాధినేని సతీష్, భూక్యా రమేష్, వందనపు సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా అభియాన్...

హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా జూలూరుపాడులో బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ.. ఆగస్టు 15న పౌరులందరూ దేశభక్తిని చాటుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన నాయకులను స్మరించుకుంటూ జాతీయ జెండాను ఇంటిపై ఎగరవేయాలన్నారు.

సీఎం సభను బహిష్కరించాలి

ఇల్లెందు: సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లెందు నియోజకవర్గానికి రాకుండా ఖమ్మం జిల్లాకు తరలించి ప్రారంభోత్సవం చేయబోతున్న సీఎం రేవంత్‌రెడ్డి సభను ఇల్లెందు, గార్ల, బయ్యారం మండలాల రైతులు బహిష్కరించాలని బీజేపీ మహిళా మోర్చా మానుకోట జిల్లా అధ్యక్షురాలు సీతంపేట ఎంపీటీసీ గుండెబోయిన నాగమణి అన్నారు. మంగళవారం ఇల్లెందులో విలేకరులతో మాట్లాడుతూ... బేతంపూడి ప్రాజెక్టును, బయ్యారం రిజర్వాయర్ నిర్మాణం చేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. కేవలం పాలేరు, వైరా రిజర్వాయర్‌లకు నీరు తీసుకుని వెళ్లేందుకు మాత్రమే సీతారామ ప్రాజెక్టును ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. సీఎం, మంత్రులకు గుణపాఠం చెప్పేందుకు సీఎం సభను బహిష్కరించాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రికి సామగ్రి



సామగ్రి అందజేస్తున్న గౌస్, ఖాజా

ఇల్లెందు: పట్టణంలోని ప్రముఖ కూరగాయల వ్యాపారులు యాకుబ్‌సేట్ కుమారులు గౌస్, ఖాజా ప్రభుత్వాస్పత్రిలో అవసరమైన సామగ్రిని వితరణగా అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ ఫర్జానాలకు మంగళవారం ప్లాస్టిక్ స్టూల్స్, డస్ట్‌బిన్స్, బెడ్‌షీట్లు, హోల్ బిన్స్, టబ్స్ అందజేశారు.

మందకృష్ణ స్వాగత సభకు తరలివెళ్లిన నాయకులు

టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న మందకృష్ణ మాదిగకు అభినందనలు తెలుపుతూ స్వాగత సభకు మంగళవారం టేకులపల్లి నుంచి ఎమ్మార్పీఎస, ఎంఎస్‌సీ నాయకులు తరలి వెళ్లారు. మండల కేంద్రంలో భారీగా ర్యాలీ నిర్వహించారు. నల్లగట్ల వెంకన్న, జినక ఇస్తారి, చింతల మోహన్‌రావు, మెంతిన ప్రభాకర్, మెంతెన కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో కవాతు

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 15న కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో నిర్వహించే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కవాతును మంగళవారం జీఎం సెక్యూరిటీ బీఆర్ దీక్షితులు పర్యవేక్షించారు. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. జీఎం మాట్లాడుతూ.. జాతీయ పతాకావిష్కరణ వేడుకల్లో సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది, కొత్తగూడెంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, స్కౌట్స్ అండ్ గైడ్స్, బ్యాండు పార్టీ బృందాలు అతిథులను అలరించేలా వేడుకలు నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్, ఎంసీ పాసినెట్, సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ కే.సత్యనారాయణ, సీనియర్ సెక్యూరిటీలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష... కొత్తగూడెంలో ఈనెల 15న నిర్వహించనున్న 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై మంగళవారం జీఎం కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏరియా జీఎం ఆదేశాల మేరకు ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్, ఏరియా జీఎం కార్యాలయంలో జరిగే వేడుకలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. గ్రౌండ్ లెవెనింగ్, ఇతర సివిల్ పనులను త్వరితగతిన రక్షణతో చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సివిల్ రామకృష్ణ, డీజీఎం శివకేశవరావు, కే.హన సుమలత, డీవైపీఎం ఎం.శ్రావణ్‌కుమార్, పీఓ ఎం.మురళి, ఈఈ అనిల్, శంకర్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వి.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

సింగరేణి బారి నుంచి కాపాడండి..

ఇల్లెందురూరల్: ఓసీ పేరుతో మాకు నివాసం లేకుండా చేసేందుకు కుట్ర చేస్తున్న సింగరేణి బారి నుంచి తమను కాపాడాలని మండలంలోని తిలక్‌నగర్ ప్రజలు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తిలక్‌నగర్ భూగర్భం నుంచి గతంలో అండర్ గ్రౌండ్ మైన్ ద్వారా బొగ్గు వెలికితీత పనులు జరిగినట్లు చెప్పారు. భారీ వర్షాల సమయంలో, భూమి కుంగిపోయిన సమయంలో సింగరేణి మట్టి పోయడం జరుగుతోందని గుర్తుచేశారు. గనుల నుంచి విషవాయువులు వెలువడి పలు జీవాలు మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితిని నెట్టుకొస్తున్న తమను ఓసీ పేరుతో ఈ ప్రాంతం నుంచి ఖాళీ చేయించే కుట్ర జరుగుతోందని వాపోయారు.

జేకే ఓసీ పేరుతో నిర్వాసిత ప్రాంతాన్ని ప్రకటించి సర్వే చేసిన సమయంలో నిర్వాసిత ప్రాంతం మినహా ఇతర క్వార్టర్లకు మరమ్మతులు చేయించుకోవచ్చని చెప్పిన అధికారులు ఆ తరువాత మరమ్మతు పనులను అడ్డుకోవడంతోపాటు నిర్మాణాలను కూల్చివేస్తున్నారని, ఇదెక్కడి న్యాయం అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏరియాల వారీగా ఉత్తమ ఉద్యోగులు వీరే

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందు: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సింగరేని కొత్తగూడెం, ఇల్లెందు ఏరియాల్లో ఉద్యోగుల ఉద్యోగులనుప్రకటించారు. ఇందులో ఏరియాకు ఒకరు చొప్పున ఉత్తమ సింగరేణియన్‌ను సీఎండీ సన్మానించనున్నారు. ఈ జాబితాలో కొత్తగూడెం నుంచి కిష్టారం ఓసీ పిట్టర్ అయినవెల్లి శ్రీనివాసరావు, ఇల్లెందు ఏరియా నుంచి కేటీసీ ఫిట్టర్ కొంగర వెంకటేశ్వరరావుకు స్థానం దక్కింది. అలాగే, కొత్తగూడెం ఏరియా ఉత్తమ ఉద్యోగులుగా పాటర్లపాటి విజయ్‌భాస్కర్, కున్సోత్ ధాంచందర్, జి.బాలసుబ్రహ్మణ్యం, ఎం.వెంకటేశ్వరచారి, బొక్క శ్రీనివాస్, ఆవునూరి రాజేశ్వరరావు, ఎం.సురేందర్, ఎర్రవెల్లి నగేష్ ఎంపికయ్యారని జీఎం జీఎం ఎం.శాలేం రాజు తెలిపారు.

ఇక ఇల్లెందులో ఏరియా నుంచి తురాయి సతీష్‌కుమార్, రాచకొండ రాజయ్య, మాటేటి కరుణాకర్, వుబ్బలపల్లి శ్రీనివాసరావు, సయ్యద్ మహబూబ్ ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికయ్యారని జీఎం జాన్ ఆనంద్ వెల్లడించారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న యాకయ్య

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో కొనసాగుతున్న పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న పలు సంక్షేమ, ఇన్సూరెన్స్, పొదుపు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాల శాఖ ఇల్లెందు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ.చిన యాకయ్య అన్నారు. ఈ మేరకు టేకులపల్లి తపాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కొప్పురాయి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ... పోస్టాఫీసులో అన్నిరకాల పీఓఎస్‌బీ, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు. పోటీ ప్రపంచంలో తపాలా శాఖ గ్రామ ప్రజల కోసం, చిన్న మొత్తాల పొదుపు, సేవింగ్ అకౌంట్, పీపీఎఫ్, టీడీ, ఎస్‌సీఎస్ఎస్, ఎంఎస్ఎస్‌సీ రింకరింగ్‌తో అధిక వడ్డీ ,గ్రామీణ తపాలా జీవిత భీమా (ఆర్‌పీఎల్ఐ), ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రొఫెషనల్ డిగ్రీ ఉన్నవారు తపాలా జీవిత బీమా పథకం (పీఎల్ఐ) పొంచవచ్చని చెప్పారు. ఐపీపీబీ ద్వారా జనరల్ ఇన్సూరెన్స్ సంవత్సరానికి రూ.520 ప్రీమియంతో రూ.10లక్షల బీమా, రూ.755తో రూ.15లక్షల బీమా పొందవచ్చని పేర్కొన్నారు. ప్రతీ తపాలా కార్యాలయాలలో ఈ పథకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ లక్ష్మి, నరసింహారావు, అబ్దుల్, ఎస్‌పీఎం సత్యనారాయణ, సెక్రటరీ సంజీవ్, బీపీఎం గౌతమి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ: రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఇటీవల రెండు విడుతలుగా రుణమాఫీ అయిన రైతులకు రుణాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సొసైటీ ద్వారా 530 మంది రైతులకు రూ.1.54 కోట్లు మాఫీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, ఏఓ శంభోశంకర్, డీసీసీబి మేనేజర్ స్వప్న, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేశ్, డైరెక్టర్లు బుడగం మోహన్‌రావు, కనగాల నారాయణ, జరపన సీతారాంబాబు, చౌగాని పాపారావు, మైనేని వెంకటేశ్వరరావు, కిషన్, వెంకట రమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కాంగ్రెస్ నాయకులు కొండం వెంకన్న, రాము, సత్యనారాయణ, మహేశ్, చిరంజీవి, శాంతి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: ఏజెన్సీలోని గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను విస్తరింపజేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల పరిధి రేగళ్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చేతన ఫౌండేషన్ నిర్వాహకులు అందజేసిన రూ.25వేల విలువ కలిగిన స్కూల్ బ్యాగులను మంగళవారం ఎమ్మెల్యే విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, చంద్రగిరి శ్రీనివాసరావు, దీటి లక్ష్మీపతి, దారా శ్రీను, కోడి లింగయ్య, కుంజ రాంబాబు, ఎస్‌కే రషీద్, రూప్లానాయక్, రవికుమార్, భూక్యా రాంబాబు, దొబ్బల రమేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ వెంకట్

జూలూరుపాడు: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా కృషి చేయాలని మండల విద్యా శాఖ అధికారి గుగులోత్ వెంకట్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషనల్ లిట్రసీ న్యూమరీ (ఎఫ్ఎల్ఎం), ఫేస్ రిగ్నిజేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్), మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు, ఉపాధ్యాయుల సర్దుబాటు వంటి అంశాలపై ఎంఈఓ మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకొని ప్రభుత్వ పాఠశాలలో చేరిన విద్యార్థుల వివరాలను ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో తీసివేయకపోవడంతో మళ్లీ తిరిగి నమోదు చేయలేకపోతున్నామన్నారు. మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫాం విద్యార్థులకు ఎలా ఇవ్వాలని, ఈ సమస్యను పరిష్కరించాలని ఎంఈఓను హెచ్ఎంలు కోరారు. మండల నోడల్ అధికారి సంజీవరావు, జూలూరుపాడు, పాపకొల్లు కాంప్లెక్స్ హెచ్ఎంలు పాల్గొన్నారు.

'హరే రామ హరే కృష్ణ'ను ఉపసంహరించుకోండి..

టేకులపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన వర్కర్ల భవిష్యత్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు మానుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాపిత కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, వినతిపత్రం ఇచ్చారు. మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణకు అప్పగించాలని ప్రయత్నం చేస్తున్నాడని, పైలెట్ ప్రాజెక్టుగా వాళ్ల జిల్లాను ఎంపిక చేస్తున్నట్టు ప్రకటించాడని దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పాతికేళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికుల పొట్టకొట్టడం సరైంది కాదని, తక్షణమే ఆ ప్రయత్నం ఉపసంహరించుకోవాలని కోరారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, గ్యాస్ సరఫరా చేయాలని, గుడ్లు కూడా ప్రభుత్వమే నేరుగా అంగన్‌వాడీల లాగా సరఫరా చేయాలని విన్నవించారు. తక్షణం సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 21న హైదరాబాదులో పెద్ద ఎత్తున ధర్నా తలపెట్టినట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఈసం రాణి, నాగలక్ష్మి, భూక్యా మంగి, గుగులోత్ సోనా, బుల్లి, చుక్కమ్మ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించొద్దని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో భోజన వర్కర్లు మంగళవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. సుల్తానా, తాళ్లూరి కృష్ణ, కుమారి, జయ, వీరమ్మ, వెంకటమ్మ, ప్రమీల, సుజాత, ఐలమ్మ, సరిత, రాణి, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లుగా ఎదురు చూపులు..



రామవరంలోని అంగన్‌వాడీ సెంటర్

కొత్తగూడెంటౌన్: ఈవెంట్ బిల్లులు పేరుకుపోయి రెండేళ్లు దాటినా అందక అంగన్‌వాడీలు ఆవేదన చెందుతున్నారు. ప్రతీనెల అంగన్‌వాడీ సెంటర్లలో చేపట్టే వివిధ కార్యక్రమాలకు రూ.200 నుంచి రూ.500 వరకు వెచ్చిస్తారు. కేంద్రాల్లో తల్లులు, పిల్లల కోసం అమలు చేసే పథకాలు, అందుతున్న పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కోసం ఈ నగదు ఖర్చు చేస్తారు. కొత్తగూడెం ప్రాజెక్టు పరిధిలో 216, పాల్వంచ ప్రాజెక్టు పరిధిలో 237 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. టీచర్లు ముందుగా నిధులు వెచ్చించి బిల్లులు సమర్పిస్తే ఆ తర్వాత ప్రభుత్వం నుంచి విడుదలవుతాయి. కానీ ఒక్కో సెంటర్‌కు రెండేళ్ల నుంచి దాదాపు రూ.6 వేల నుంచి రూ.9 వేల వరకు బకాయి ఉన్నాయి. అయినప్పటికీ మళ్లీ నెలనెలా ఖర్చు పెట్టాల్సి వస్తుండడంతో టీచర్లు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయడమే కాక ఇక నుంచి నెలనెలా చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా సంక్షేమశాఖ అధికారి వి.విజేతను వివరణ కోరగా.. సెంటర్లకు రావాల్సిన ఈవెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట నిజమేనని, ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినందున త్వరలో వచ్చేలా చూస్తామని తెలిపారు.

ఏజెన్సీలో అన్నదాతకు తోడుగా..

- డ్రోన్లతో పురుగుమందు, ఎరువుల పిచికారీ
- సమయం, ఖర్చు ఆదా
- ప్రయోగాత్మకంగా మొండితోగులో ప్రదర్శన



పురుగుమందు పిచికారీ చేస్తున్న డ్రోన్

ఇల్లెందురూరల్: వ్యవసాయం శ్రమతో కూడుకున్నది. శారీరకంగా ఎంతో శ్రమిస్తే తప్ప పంట చేతికందని పరిస్థితి గతంలో ఉండేది. దున్నుడం, విత్తనాలు వేయడం, కలుపు తీయడం, కోతలు అన్నీ మానవశక్తినే వినియోగించేవారు. క్రమంగా వ్యవసాయంలోనూ విప్లవాత్మక మార్పులు వచ్చాయి. సంప్రదాయ సాగు నుంచి ఆధునిక శైలిలో పంటలు పండించే పద్ధతి పెరుగుతూ వచ్చింది. ట్రాక్టర్లు, యంత్రాలతో నాట్లు వేయడం, వరికోతలు తదితర పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు పురుగు ముందులు, ఎరువుల పిచికారీలోనూ యంత్రాల వినియోగం ప్రారంభమైంది. దీనికి డ్రోన్లను వినియోగిస్తూ పలువురు రైతులు సత్ఫలితాలు అందుకుంటున్నారు. శారీరక శ్రమతో కూడుకున్న వ్యవసాయ రంగం టెక్నాలజీ సహాయంతో సులభతరంంగా మారింది.

డ్రోన్ సహాయంతో..

డ్రోన్ సహాయంతో వరి, మొక్కజొన్న, పత్తి, మిర్చి తదితర అన్ని రకాల పంటలలో పురుగు మందులను పంచికారీ చేస్తున్నారు. తాజాగా ద్రవపదార్థంలో అందుబాటులోకి వచ్చిన నానో యూరియా, నానో డీఏపీలను కూడా డ్రోన్ల సహాయంతో మొక్కలకు అందిస్తున్నారు. సాధారణంగా ఎకరం విస్తీర్ణంలో పురుగుమందు పిచికారీ కోసం 50లీటర్ల నుంచి 60 లీటర్ల నీరు, 2లీటర్ల పురుగుమందు అవసరం అవుతుంది. ఒకరోజుకు ఐదుగురు మనుషులు ఐయిదు ఎకరాల విస్తీర్ణంలో పిచికారీ చేయగలరు. కానీ డ్రోన్ సహాయంతో కేవలం ఎకరం విస్తీర్ణంలో పిచికారీ చేసేందుకు 15 నుంచి 20 లీటర్ల నీరు, ఒక లీటరు పురుగుల మందు అవసరం అవుతుంది. డ్రోన్‌తో ఇద్దరు కూలీలు రోజుకు 25 ఎకరాల విస్తీర్ణంలో పిచికారీ చేస్తారు. దీనికి ఎకరం పిచికారీ చేసేందుకు రూ.500 చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. అంటే డ్రోన్ సహాయంతో కూలీ, మందు వినియోగం, సమయం పెద్ద మొత్తంలో రైతుకు ఆదా అవుతుంది అంతేకాకుండా పైరుపై సమానంగా మందు పిచికారీ చేయవచ్చు.

మొండితోగులో ప్రయోగాత్మకంగా..

వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం ప్రారంభమైనా మారుమూల మండలమైన ఇల్లెందులో మంగళవారం మంగళప్రదంగా అడుగు పెట్టింది. భారత ఎరువుల సహకార సంస్థ (ఇఫ్కో) సహకారంతో మొండితోగు రైతు సందిరి రమేష్ ప్రయోగాత్మకంగా తన వ్యవసాయ క్షేత్రంలో పురుగు మందు పిచికారీ చేయించారు. ఎరువులు, పురుగు మందుల పిచికారీలో డ్రోన్ల సేవల కోసం రైతు సందిరి రమేష్, సెల్ నంబర్ 9440608439ను సంప్రదించి డ్రోన్ సేవలను మరింత మంది రైతులు పొందవచ్చని ఇఫ్కో అధికారులు సూచిస్తున్నారు.

ఖర్చు తగ్గుతుంది..



కూలీల కొరత, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోవడం వల్ల పెట్టుబడి పెరిగింది. తాజాగా డ్రోన్లతో సత్ఫలితాలు ఊరట కలిగిస్తున్నాయి. వీటివల్ల సమయం, ఖర్చుతోపాటు నాణ్యమైన ఫలితాలు అందుతున్నాయి.

– సందిరి రమేష్, రైతు, మొండితోగు

డ్రోన్‌తో సత్ఫలితాలు..



సాగులో సూక్ష్మ ఎరువుల వినియోగం పెరగడంతో కూలీల కొరతను అధికమించేందుకు ప్రభుత్వ డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. దీనికి ఆదరణ పెరుగుతోంది. తక్కువ పెట్టుబడితోపాటు దిగుబడిలో సత్ఫలితాలు అందుతున్నాయి.

– సతీష్, ఏఓ, ఇల్లెందు